సాక్షి
శ్రీకాకుళం
సోమవారం ⋮ 4 ⋮ సెప్టెంబర్ ⋮ 2023




స్కూల్‌గేమ్స్‌కు సర్వం సిద్ధం

పాఠశాలల క్రీడల పోటీలకు రంగం సిద్ధమైంది. నేటి నుంచి పోటీలు జరగనున్నాయి. - 8లో



ఆలయ పూజారి ఆత్మహత్య

మందసలో ఆలయ పూజారి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. - 8లో



అంతరాయాలు నివారించేందుకు..

విద్యుత్ సరఫరాలో అంతరాయాలు నివారించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ వివరాలు వెల్లడించారు. - 8లో

తలరాత మారేలా.. తరతరాలు బాగుపడేలా..

- జిల్లాలో జోరుగా ప్రగతి పనులు
- వైఎస్సార్ తర్వాత అత్యధిక పనులు చేపడుతున్న సీఎం వైఎస్ జగన్
- ఇప్పటికే ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు, కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రి పూర్తి
- యుద్ధ ప్రాతిపదికన వంశధార లిఫ్ట్, మహేంద్ర తనయ ఆఫ్‌షోర్ పనులు
- ముమ్మరంగా మూలపేట పోర్టు నిర్మాణం

ఉన్న చోట బతుకులేక ఊరిలో బతకలేక వలస పోతున్న మత్స్యకారుల కోసం మూలపేట పోర్టు.. ఏటికేటా తగ్గిపోతున్న ఉద్దానం ఆయుష్షు రేఖకు ఊపిరి పోసేందుకు మంచినీటి ప్రాజెక్టు, కిడ్నీ రీసెర్చ్ సెంటర్.. ఓ వైపు నీరున్నా మరోవైపు కన్నీరు పెడుతున్న పొలం గొంతు తడిపేందుకు వంశధార ప్రాజెక్టు, ప్రతి యేడూ ఏడుపే మిగులుతున్న పలాస శివారు ప్రాంతాల కోసం ఆఫ్‌షోర్ ప్రాజెక్టు.. అంతేనా.. ఫిషింగ్ హార్బర్లు, జెట్టీలు, లిఫ్ట్ ఇరిగేషన్ వంటి నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయి. ఇవన్నీ కేవలం గత నాలుగేళ్ల వ్యవధిలో జరిగిన పనులు. సగటు శ్రీకాకుళం వాసి మనసు తెలుసుకుని వారి బతుకు బాగు చేసేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంధించిన ప్రగతి బాణాలు.



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: శ్రీకాకుళం రూపురేఖలు మార్చే కీలక ప్రాజెక్టులు పూర్తి కావస్తున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చొరవతో జిల్లా వాసుల చిరకాల వాంఛలు నెరవేరనున్నాయి. ఇప్పటికే శ్రీకాకుళం తీరానికి మణిహారంగా నిలవనున్న గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ల్యాండ్ లార్డ్ మోడల్ విధానంలో రూ.2,949.70కోట్లతో ప్రాజెక్టు తొలి దశ పనులను వచ్చే ఏడాది డిసెంబర్ కల్లా పూర్తి చేసేలా నిర్మాణం వేగవంతం చేసింది. ప్రాజెక్టు పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా 25వేల మందికి ఉపాధి లభిస్తుంది.

దీర్ఘకాలిక సమస్యలకు చెక్..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంతో పాటు వెనుకబాటును పారదోలేందుకు కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జిల్లాలో కీలక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టగా ఆ తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాకనే జిల్లాలో ప్రత్యేక ప్రాజెక్టులు కార్యరూపం దాల్చాయి. అందులో ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు ఒకటి. వంశధారను అమృతధారలా మార్చి ఉద్దానం గొంతు తడిపేందుకు రూ.700కోట్లతో భారీ మంచినీటి ప్రాజెక్టును నిర్మించింది. ఉద్దానాన్ని పట్టిపీడిస్తున్న కిడ్నీ మహమ్మారిపై జలాస్త్రాన్ని సంధిస్తోంది. ఏకంగా రూ.50కోట్లతో కిడ్నీ రీసెర్చ్ కమ్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించింది. ఇప్పుడీ రెండు ప్రాజెక్టులు దాదాపు పూర్తయ్యాయి. త్వరలో సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా ప్రారంభం కానున్నాయి.

సాగునీటి సమస్య తీరేలా..

నేరడి నిర్మాణానికి ఒడిశా అడ్డంకులు ఇంకా తొలగలేదు. దీంతో దీనికి ప్రత్యామ్నాయంగా గొట్టా బ్యారేజీ వద్ద నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్‌కు పంపించేలా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. దాదాపు రూ.176.35 కోట్ల వ్యయంతో చేపడుతున్న పనులు ప్రస్తుతం ప్రారంభమయ్యాయి. జిల్లాలో మరో కీలకమైన ఆఫ్‌షోర్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు వేగవంతం చేశారు. మహేంద్ర తనయ వద్ద పనులు ప్రస్తుతం జోరుగా సాగుతున్నాయి. 26వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, పలాస పట్టణానికి తాగునీరు అందించేందుకు రూ.852.45కోట్లకు పైగా ఖర్చు పెడుతున్నారు. వంశధార, నాగావళి నదుల అనుసంధానం ప్రాజెక్టు కూడా పూర్తి కావచ్చింది.

మత్స్యకారుల కష్టాలు గట్టెక్కేలా..

సాగర మాల ప్రాజెక్ట్‌లో భాగంగా మత్స్యకారుల సంక్షేమం దృష్ట్యా రాష్ట్ర వ్యాప్తంగా ఫిషింగ్ హార్బర్లను నిర్మిస్తోంది. అందులో భాగంగా 193 కిలో మీటర్ల తీర ప్రాంతం, సరాసరి లక్షా 95వేల మెట్రిక్ టన్నుల మత్స్య సంపద లభిస్తున్న శ్రీకాకుం జిల్లాలో కూడా ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. బుడగట్లపాలెం వద్ద రూ.365.81కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మించేందుకు ఇప్పటికే సీఎం చేతులమీదుగా శంకుస్థాపన కూడా జరిగింది. ఇది పూర్తయితే శ్రీకాకుళం, ఎచ్చెర్ల, నరసన్నపేట నియోజకవర్గాల మత్స్యకారులకు ప్రయోజనం కలగనుంది. పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల మత్స్యకారులకు మేలు చేసేందుకు వజ్రపుకొత్తూరు మండలంలోని నీళ్లపేటలో ప్రస్తుతం రూ. 11.95కోట్లతో జెట్టీ నిర్మాణం చేపడుతోంది. దానినే ఫిషింగ్ హార్బర్‌గా అప్‌గ్రేడ్ చేసి, పనులు చేపట్టేందుకు తాజాగా వైఎస్ జగన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.



పలాసలో నిర్మితమవుతున్న కిడ్నీ రీసెర్చ్ కమ్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి



మెళియాపుట్టి వద్ద ఉన్న శుద్ధి కేంద్రం



మూలపేట వద్ద పోర్టు కోసం నిర్మించిన సౌత్ బ్రేక్ వాటర్ నిర్మాణం

రూ.2,949.70 కోట్లతో మూలపేట పోర్టు

తూర్పు తీరంలో ఉత్తరాంధ్రలో ప్రస్తుతం విశాఖ పట్టణం పోర్టు ఒక్కటి మాత్రమే జల మార్గంలో వ్యాపార లావాదేవీలకు అనుకూలంగా ఉంది. ఆ తర్వాత శ్రీకాకుళం జిల్లా నుంచి ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్‌లకు జల మార్గంలో అతి తక్కువ దూరం కలిగిన పోర్టు మరొకటి లేదు. దీంతో రాష్ట్రంలో నాలుగు చోట్ల పోర్టులు నిర్మిస్తున్నా అత్యంత వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉన్న పోర్టుగా మూలపేట పోర్టును ప్రతిష్టాత్మకంగా వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకుంది. దానిలో భాగంగా ల్యాండ్ లార్డ్ మోడల్ విధానంలో రూ.2,949.70కోట్లతో తొలి విడత ప్రాజెక్టు పనులు చేపడుతోంది. వార్షిక సామర్థ్యం 83.3మిలియన్ టన్నులు కాగా, తొలి దశలో 23.5మిలియన్ టన్నుల సామర్థ్యంతో నాలుగు బెర్తుల నిర్మాణం, ఇతర మౌలిక వసతుల కల్పన పనులు చేపడుతున్నారు. నాలుగు బెర్తుల్లో రెండు జనరల్ కార్గోకు, ఒకటి బొగ్గు, ఇంకొకటి కంటైనర్‌తో పాటు ఇతర ఎగుమతి, దిగుమతులకు వినియోగిస్తారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఇక్కడ దొరుకుతున్న అంతర్జాతీయ ఖ్యాతి ఉన్న నీలి గ్రానైట్ తదితర ఖనిజాలు, జిల్లా తీర ప్రాంతంలో లభ్యమవుతున్న లక్షా 95వేల మెట్రిక్ టన్నుల మత్స్య సంపద, పలాస జీడిపప్పు, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాలకు చెందిన మినరల్ శాండ్, ముడి ఇనుము, సోయామీల్, ఫెర్రో ఉత్పత్తుల ఎగుమతులకు ఉపయోగపడుతుంది. థర్మల్ బొగ్గు, కుకింగ్ కోల్, ఎరువులు, ముడి జీడి గింజలు, సున్నపురాయి, వంట నూనెల దిగుమతికి ఉపయోగపడనుంది.

వచ్చే ఏడాది డిసెంబర్ కల్లా తొలి దశ పూర్తి..

మూలపేట పోర్టు నిర్మాణ పనులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం. వచ్చే ఏడాది డిసెంబర్ కల్లా తొలి దశ పనులు పూర్తి చేస్తాం. ప్రస్తుతం పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. అన్ని రకాల పనులు ప్రారంభమయ్యాయి.

– ఎం.శంకర్, జీఎం, విశ్వ సముద్ర నిర్మాణ సంస్థ



పోర్టు లోపల జరుగుతున్న అభివృద్ధి పనులు

శరవేగంగా పోర్టు పనులు

సీఎం చేతులు మీదుగా శంకుస్థాపన జరిగిన కొన్ని రోజులకే పోర్టు పనులు ప్రారంభమయ్యాయి. సౌత్ బ్రేక్ వాటర్ పనులు, పైలింగ్ ప్రాజెక్టు విస్తరణ పనులు, బెర్తుల నిర్మాణం కోసం మట్టి పనులు జరిగాయి. పోర్టు నిర్మాణంలో కీలకమైన బ్రేక్ వాటర్ పనులకు సంబంధించి 580 మీటర్లకుగాను 465 మీటర్ల మేరకు చేపట్టింది. మూడు కార్గో బెర్తులకు గాను బెర్తు నిర్మాణ పనులను త్వరితగతిన చేపడుతున్నారు. క్యాటింగ్ యార్డు పనులు జోరుగా జరుగుతున్నాయి. టెస్ట్ పైలింగ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కాంక్రీటు తయారీ కోసం ఏకంగా బ్లాచింగ్ చిప్స్ ప్లాంటు ఏర్పాటు చేశారు. మరో రెండు కార్గో బెర్తులు, ఒక కోల్ బెర్తు నిర్మాణానికి సిద్ధమవుతోంది. నార్త్ బ్రేక్ వాటర్ పనులను సెప్టెంబర్‌లో చేపట్టనుంది. ఒక వైపు పోర్టు నిర్మాణ పనులు చేపడుతూనే మరోవైపు పోర్టు కోసం భూములిచ్చి నిరాశ్రయులైన మూలపేట, విష్ణుచక్రం గ్రామాలకు చెందిన 596 కుటుంబాలకు రూ. 35కోట్లతో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్మాణం పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. ఒక్కో కుటుంబానికి 5 సెంట్ల స్థలంలో ఇళ్లు నిర్మిస్తున్నారు.



బెర్త్ విస్తరణ పనులు

న్యూస్‌రీల్

డ్రైవింగ్ స్కూల్ 14వ బ్యాచ్ ప్రారంభం

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో 14వ బ్యాచ్ ఈనెల రెండో వారంలో ప్రారంభమవుతుందని ఏపీఎస్ ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్‌ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో ఇప్పటి వరకూ 13 బ్యాచ్‌లు దిగ్విజయంగా పూర్తి చేశామన్నారు. ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో డ్రైవింగ్ శిక్షణతో పాటు బస్సు మొత్తం విడి భాగాల మీద మెకానికల్ క్లాస్‌లు, యోగా, వ్యక్తిత్వ వికాసం, ట్రాఫిక్‌లో కూడా శిక్షణ ఇస్తామన్నారు. 14వ బ్యాచ్‌లో శిక్షణ తీసుకోదల్చినవారు శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణా అధికారి వారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఇతర వివరాలకు 9963091999, 73829 23293 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

జెడ్పీ సీఈఓకు పితృ వియోగం



రావాడ పాపారావు (ఫైల్)

సారవకోట: జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్ తండ్రి రావాడ పాపారావు(94) సారవకోట మండలం కుమ్మరిగుంట గ్రామంలో శనివారం రాత్రి మృతి చెందారు. ఈయన హిస్టరీ లెక్చరర్‌గా నరసన్నపేట, జలుమూరు తదితర చోట్ల పని చేసి రిటైర్ అయిన తర్వాత కుమ్మరిగుంట గ్రామంలో ఉంటున్నారు. ఈయనకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు. ఆదివారం కుమ్మరిగుంటలో జరిగిన అంత్యక్రియల్లో పలువురు జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సంగీతంతో రుగ్మతలు దూరం



కళాకారులను సత్కరిస్తున్న అతిథులు

శ్రీకాకుళం కల్చరల్: సంగీతంతో మనలో ఉన్న రుగ్మతలు దూరమవుతాయని పలువురు వక్తలు అన్నారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో కచ్ఛపి కళాక్షేత్రం 10వ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలను సంస్థ కాపాడుతోందని అన్నారు. ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ పి.జగదీష్ రావు, డాక్టర్ బాడాన దేవభూషణరావు మాట్లాడుతూ సంగీతం మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తుందని అన్నారు. డాక్టర్ నిక్కు అప్పన్న సంస్థకు రూ.5వేలు విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా ఉదయం శాస్త్రీయ సంగీత పోటీలను సీనియర్ విభాగంలో నిర్వహించారు. సాయంత్రం జరిగిన వాయులీన సంగీత కచేరిలో విశాఖ పట్నంకు చెందిన ఆలిండియా ఎ గ్రేడ్ ఆర్టిస్టు ముట్నూరు శ్రీనివాస నర్సింహమూర్తి కచేరీ ఆకట్టుకుంది. త్యాగరాజ కీర్తనలు, ముత్తు స్వామి దీక్షితుల కీర్తనలను వీనులవిందుగా ఆలపించారు.

ఏపీ శాక్స్ ఉద్యోగులను క్రమబద్ధీకరించండి

కాశీబుగ్గ: నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ పరిధిలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఏపీ శాక్స్ ఉద్యోగుల జిల్లా సంఘ అధ్యక్షుడు బగాది శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి రోణంకి భూపతిరావులు కోరారు. రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును ఆయన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం కలిసి వినతిపత్రం అందించారు. 20 ఏళ్లుగా పనిచేస్తున్నామని రాష్ట్రంలో 1200 మంది ఉద్యోగులు, వారి కుటుంబాలు జీవిస్తున్నాయని అన్నారు. ఆర్థికంగా తాము పడుతున్న సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ధనరాజులమ్మకు పూజలు



ధనరాజులమ్మ ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న లొద్దపుట్టి ధనరాజులమ్మకు ఆదివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఒడిశా బరంపురం, ఛత్రపురం, జయంతిపురం, పాత్రపురం ప్రాంతాలతో పాటు ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి మండలాలకు చెందిన వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

● ఆట విడుపు

నిత్యం పని ఒత్తిడిలో ఉండే ఇంజినీర్లు, సిబ్బందికి ఆటవిడుపు లభించింది. ఈ నెల 15వ తేదీన జరిగే 'ఇంజినీర్స్ డే' సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పంచాయతీరాజ్ ఇంజినీర్లు, ఉద్యోగులు, సిబ్బంది క్రీడలతో కాసేపు సేద తీరారు. నగరంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న ఇండోర్ స్టేడియంలో ఆదివారం బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. పీఆర్ జేఏసీ చైర్మన్ ఎస్.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కేసీహెచ్ మహంతిలు సంయుక్తంగా ఈ పోటీలను ప్రారంభించారు. పంచాయతీరాజ్ ఇంజినీర్లకు మానసిక ఒత్తిడి నుంచి బయటపడేందుకు ఈ పోటీలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. ముున్ముందు సెలవు రోజుల్లోను, ఉదయం, సాయంత్రం మరిన్ని క్రీడాపోటీలను నిర్వహిస్తామని, విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఈనెల 15న బహుమతులు అందజేస్తామన్నారు. ఆరోజు పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు.

– శ్రీకాకుళం న్యూకాలనీ



ఉత్సాహంగా కొనసాగుతున్న పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న పీఆర్ జేఏసీ చైర్మన్ ఎస్.రామకృష్ణ, కేసీహెచ్ మహంతి



మ్యాచ్‌లకు సిద్ధమంటున్న యువ ఇంజినీర్లు, ఉద్యోగులు

ఆపదలో ఆదుకున్న మంత్రి సీదిరి



క్షతగాత్రునికి ప్రథమచికిత్స అందిస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

నందిగాం: మండలంలోని కొత్త అగ్రహారం పంచాయతీ వజ్జీలపేట వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాద బాధితులను మంత్రి సీదిరి అప్పలరాజు ఆదుకున్నారు. మండలంలోని శివరాంపురం పంచాయతీ కోటిపల్లికి చెందిన దట్టి అప్పయ్య(57) వజ్రపుకొత్తూరు మండలం తాళ్లభద్రలో జరుగుతున్న తన బంధువుల పెళ్లికి బైక్‌పై వెళ్లి ఆదివారం ఉదయం తిరుగు ప్రయాణమయ్యాడు. వజ్జీలపేట వద్దకు వచ్చేసరికి అదే మార్గాన పలాస నుంచి టెక్కలి వైపు వెళ్తున్న కారు ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై నుంచి కిందకు పడిపోవడంతో తలకు, చేతులతో పాటు శరీరంపై గాయాలయ్యాయి. అదే సమయంలో పలాస నుంచి శ్రీకాకుళం పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహణకు వెళ్తున్న రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రమాదం చూసి తన వాహనాన్ని నిలిపి క్షతగాత్రులకు సపర్యలు చేశారు. స్వతహాగా వైద్యుడు కావడంతో ప్రథమ చికిత్స చేసి మరో కారులో టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి పంపించారు.

7న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో జగన్నాథసాగరం సమీపంలో ఉన్న శ్రీరామకృష్ణ, శారదా మాత పీఠం వద్ద ఈనెల 6వ తేదీ నుంచి 7వ తేదీ వరకు శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు ఇచ్ఛాపురం కృష్ణారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం పతాకావిష్కరణతో ప్రారంభమై ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టి అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించి సాయంత్రం ఉట్టిని కొట్టే ప్రక్రియ, ఉయ్యాల పవళింపు సేవ, భజన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వజ్రపుకొత్తూరు మండలం బెండిగేటు దత్తాత్రేయ ఆలయం వద్ద యాదవకుల సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో 6వ తేదీ సాయంత్రం ఉట్టిని కొట్టే కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

'ముస్లింల అభివృద్ధికి కృషి'



హుస్సేని మసీదులో చదర్ పై పూలు చల్లుతున్న మంత్రి ధర్మాన, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం కల్చరల్: ముస్లింల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. స్థానిక ప్రకాష్ నగర్ కాలనీలోని హుస్సేనీ మసీదు పునర్నిర్మాణ భవనం ప్రారంభం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ముస్లిం రిజర్వేషన్ల కోసం కృషి చేసి నాలుగు శాతం రిజర్వేషన్లు సాధించామని అన్నారు. దాని వల్ల ఎందరో ఉద్యోగాలు పొంది స్థిరపడ్డారని తెలిపారు. పేద జీవితం గడుపుతున్న ముస్లిం కుటుంబాలను ఆదుకునేందుకు తాము ముందుంటామని తెలిపారు. ఇక్కడి షాదీ ఖానా బాగు చేయించేందుకు సీఎంకు చెబుతానని, అవసరమైతే నిధులు మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా ఖర్చు చేసేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. 14 ఏళ్ల టీడీపీ పాలనలో ఒక్క ముస్లింకు కూడా ప్రయోజనం కలగలేదన్నారు. ముందుగా మసీదులోని హజరత్ బంగేషా హుస్సేని సమాధి వద్ద చదర్ కప్పి, పూలు చల్లారు. అనంతరం గులాం మహ్మద్ హాబ్బి ఖిబ్లా ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి, డీసీఎంఎస్ అధ్యక్షుడు గొండు కృష్ణమూర్తి, కోణార్క్ శ్రీను, ముస్లిం పెద్దలు ఎంఎ రఫీ, వి.ఖాదర్ భాషా, ఐహెచ్ ఫరూక్, ఎంఎ బేగ్, ఎంఎ సిరాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

పది మంది జూదగాళ్లు అరెస్టు

గార : మండలంలోని శ్రీకూర్మం సముద్రతీర ప్రాంతంలో జిల్లాలోని కొన్ని గ్రామాల నుంచి వచ్చి పేకాట ఆడుతున్న పదిమందిని అరెస్టు చేశామని సీఐ ఎస్.కామేశ్వరరావు తెలిపారు. శ్రీకూర్మం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గత కొన్నిరోజులుగా వివిధ స్థలాలు మారుస్తూ పేకాట ఆడిస్తున్నారు. ఈ పదిమందితో పాటు పది ద్విచక్రవాహనాలు, రూ.17,500లు నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. ఎక్కడైనా జూదం ఆడితే తమకు సమాచారం అందజేయాలని, ఇవి చట్టవ్యతిరేక కార్యకలాపాలని తెలిపారు.

క్లుప్తంగా

200 కిలోమీటర్లు ప్రయాణించి..


విశాఖలో టేకేశ్వరరావుకు పెన్షన్ అందిస్తున్న వలంటీర్ పావని

పాతపట్నం: అనారోగ్యం కారణంగా విశాఖలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తికి పింఛన్ అందించేందుకు ఓ వలంటీర్ 200 కిలోమీటర్లు ప్రయాణించారు. సింగుపురం గ్రామానికి చెందిన టేకేశ్వరరావు విశాఖలోని టాటా మెమోరియల్ ఆస్పత్రిలో గత కొంతకాలంగా చికిత్స పొందుతున్నారు. ఆయనకు వృద్ధాప్య పింఛన్ అందించేందుకు వలంటీర్ పావని విశాఖ వెళ్లారు. అంతదూరం ప్రయాణించి లబ్ధిదారుడికి డబ్బు అందజేసినందుకు వలంటీర్‌ను అంతా అభినందించారు.

భక్తుల వసతి గది నిర్మాణానికి రూ.2.50 లక్షలు వితరణ


విరాళ చెక్కును ఈఓకు అందజేస్తున్న వరం కుటుంబసభ్యులు

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయంలో భక్తుల కోసం వసతి గది నిర్మాణానికి దివంగత అంధవరపు వరాహనర్సింహం జయంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు రూ.2.50 లక్షల చెక్కును ఆదివారం ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్‌కు అందజేశారు. ఈ మేరకు వరం కుమార్తె వైఎస్సార్‌సీపీ నేతలు పైడిశెట్టి జయంతి బెనర్జీ, కుమారులు అంధవరపు ప్రసాద్, స్నేహ, సంతోష్, సింధు దంపతులు కలిసి ఈ విరాళాన్ని అందజేశారు. అంతకుముందు ఆదిత్యుడిని కుటుంబ సభ్యులంతా కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో వారికి ఆదిత్యుని తీర్థ ప్రసాదాలు, వేదాశీర్వచనాలను అందజేశారు. ఈ సందర్భంగా అంధవరపు ప్రసాద్ మాట్లాడుతూ తన తండ్రికి ఆదిత్యుని ఆలయమంటే ఎంతో ఇష్టమని, ఆయన పేరిట ట్రస్ట్ పేరిట పలు సేవా కార్యక్రమాలను నిర్వర్తిస్తున్నామని, ఇందులో భాగంగానే వసతి గది నిర్మాణానికి సంకల్పించామని తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ అంధవరపు సూరిబాబు, ఆలయ పాలక మండలి సభ్యులు మండవిల్లి రవి, డాక్టర్ కె.సోమేశ్వరరావు, లుకలాపు గోవిందరావు, దుక్క గనిరాజు, జలగడుగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో ప్రత్యేక పూజలు

శ్రావణ ఆదివారం సందర్భంగా అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామిని ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు దర్శించుకున్నారు. పూజలు, విరాళాల పేరిట రూ.66,076, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ. 1.75 లక్షలు, దర్శన టిక్కెట్లు విక్రయాల ద్వారా రూ.1,81,200 వరకు ఆదాయం లభించినట్లుగా ఈఓ తెలిపారు.

ఉపాధ్యాయులకు పురస్కారాలు

శ్రీకాకుళం : శ్రీ శ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో 193 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. ఆదివారం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి ఫౌండేషన్ ఫౌండర్, చైర్మన్ చిందు శ్రీకాంత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చిందు శ్రీకాంత్ మాట్లాడుతూ గురువుల ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని చాటి చెప్పడం ప్రతి ఒక్కరి విధి అని, అందుకే ఈ అవార్డులు అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వైస్ ప్రిన్సిపాల్ బి.వి.రమణమూర్తి, విశాఖపట్నం గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ పి.సుందరయ్య చేతుల మీదుగా ఉపాధ్యాయులకు ఘనంగా సత్కరించి అవార్డులు అందించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు, ఎస్ఐ ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	60,380–00
బంగారం(22కి. 10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

స్కూల్‌గేమ్స్‌కు సర్వం సిద్ధం

- పాఠశాలల క్రీడా పోరుకు సిద్ధం
- మొత్తం ఐదు స్థాయిల్లో జరగనున్న పాఠశాలల క్రీడా పోటీలు
- నేటి నుంచి మండల స్థాయి అండర్- 14,17 ఎంపిక పోటీలతో మొదలు
- 9వ తేదీ వరకు స్కూల్‌గేమ్స్ మండలస్థాయి పోటీలు


కూతకు సిద్ధమవుతూ.. కబడ్డీ శిక్షణలో క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాలల క్రీడల (స్కూల్ గేమ్స్)కు రంగం సిద్ధమైంది. రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ పరిధిలోని పాఠశాల క్రీడల సమాఖ్య (స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో జరగనున్న స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలకు అధికారులు ఏర్పాట్లు చేశారు. చాలాకాలం తర్వాత గత ఏడాదే ఈ పోటీలను పునరుద్ధరించారు. ఈ ఏడాది మాత్రం విద్యాశాఖ ఆధ్వర్యంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధికారులు, పీఈటీ సంఘ నాయకులు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ప్రాతిపదికగా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

స్కూల్‌గేమ్స్ పోటీలకు అర్హులు ఎవరంటే?

- స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు అండర్–14, 17, 19 వయో విభాగాల్లో బాలబాలికలకు వేరువేరుగా జరుగుతాయి. పాఠశాల విద్య పరిధిలో అండర్ 14, 17 విభాగాల్లో, ఇంటర్మీడియెట్ విద్య పరిధిలో అండర్–19 ఎంపికలు జరుగుతాయి.
- అండర్–14 బాలబాలికలు 2010 జనవరి ఒకటి, అండర్–17కు 2007 జనవరి ఒకటి, అండర్–19కు 2005 జనవరి ఒకటి తర్వాత జన్మించి ఉండాలి.
- అండర్–14కు 8వ తరగతిలోపు చదువుతూ ఉండాలి. అండర్–17కు ఇంటర్ ఫస్టియర్‌లోపు చదువుతూ ఉండాలి. అండర్–19కు డిగ్రీ ఫస్టియర్‌లోపు చదువుతూ ఉండాలి.
- స్కూల్‌గేమ్స్ పోటీల్లో పాల్గొనే బాలబాలికలు 'స్కూల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ (ఎస్ఈఎం)' యాప్ నందు తమ వివరాలను నమోదు చేసుకోవాలి. పారదర్శకత కోసం ఈ ఏడాది మొదటిసారిగా ఈ ప్రయోగాన్ని తీసుకువచ్చారు. ప్రభుత్వ, ప్రైవేటు అన్ని యాజమాన్యాల పాఠశాలలు, జూనియర్ కళాశాల విద్యార్థులు వారి యూ–డైస్ కోడ్‌తో వారి పాఠశాల యొక్క పాస్‌వర్డ్ ద్వారా లాగిన్ అవ్వాలి. అందులో ఎస్‌జీఎఫ్ పోర్టల్‌లో క్రీడాకారులు తమ వివరాలను ఎంటర్ చేసి సబ్మిట్ చేయాలి.

నేటి నుంచి మండల పోరు

స్కూల్‌గేమ్స్ అండర్–14, 17 పోరులో భాగంగా నేటి నుంచి మండలస్థాయి పోరు ఆరంభంకానుంది. ఈనెల 9వ తేదీ వరకు ఆయా మండలాల్లో నిర్దేశించుకున్న షెడ్యూల్ ప్రకారం రెండు రోజులపాటు ఈ పోటీలను నిర్వహిస్తారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నీకాయిట్, త్రోబాల్, యోగా ఈ తొమ్మిది క్రీడాంశాల్లో తొలుత మండలస్థాయి పోటీలు జరగనున్నాయి. మండల స్థాయిలో ఇప్పటికే పోటీలు జరిగే వేదికను, మండల స్పోర్ట్స్ పరిశీలకులను నియమించారు. అక్కడి హెచ్ఎం, మండల ఎంఈఓలు ఈ పోటీలను పర్యవేక్షించడంతో పాటు అవసరమైన ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించనున్నారు.

నియోజక వర్గ, జిల్లాస్థాయి పోటీలు ఇలా..

నియోజకవర్గస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలు ఈనెల 11 నుంచి 16వ తేదీ వరకు జరగనున్నాయి. మండల స్థాయిలో జరుగుతున్న 9 క్రీడాంశాల్లో ఎంపికైన క్రీడాకారులంతా నియోజకవర్గ స్థాయిలో పోటీపడతారు. శ్రీకాకుళం అర్బన్‌తో కలిపి 39 మండలాల పరిధిలో ఎంపికైన బాలబాలికలు వారివారి నియోజకవర్గంలో ఎంపికచేసిన కేంద్రాల్లో జరిగే పోరులో పోటీపడతారు. అక్కడ ఎంపిక చేసిన జట్లు/క్రీడాకారులు జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో నేరుగా అర్హత సాధిస్తారు. వీరితోపాటు మిగిలిన మరో 23 క్రీడాంశాలతో కలిపి జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో తలపడతారు. ఈ పోటీలు ఈనెల 25 నుంచి 30వ తదీ వరకు శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్) కళాశాలతోపాటు సమీపంలోని కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణం వేదికగా పోటీలు నిర్వహించనున్నారు.


వాలీబాల్ సాధనలో క్రీడాకారులు

32 క్రీడాంశాలతో జిల్లాస్థాయి పోటీలు

జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు మొత్తం 32 క్రీడాంశాల్లో జరగనున్నాయి. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్, జూడో, సెపక్‌తక్ర, హాకీ, తైక్వాండో, టెన్నీస్, రెజ్లింగ్, బాస్కెట్‌బాల్, ఫెన్సింగ్, చెస్, బాల్‌బ్యాడ్మింటన్, క్రికెట్, ఫుట్‌బాల్, త్రోబాల్, నెట్‌బాల్, రోప్‌స్కిప్పింగ్, రగ్బీ, వెయిట్‌లిఫ్టింగ్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, టెన్నీకాయిట్, యోగా, ఆర్చరీ, బాక్సింగ్, స్విమ్మింగ్, రోలర్‌స్కేటింగ్, టేబుల్‌టెన్నీస్ క్రీడాంశాల్లో ఎంపికలు జరుగుతాయి. ఇక్కడ ఎంపిక చేసిన జిల్లా జట్లు/క్రీడాకారులు వివిధ జిల్లాల్లో జరిగే.. రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. అక్కడ రాణించినవారు వివిధ రాష్ట్రాల్లో జరిగే.. జాతీయ పోటీలకు ఎంపికై రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తారు.

పకడ్బందీగా ఏర్పాట్లు



జిల్లాలో స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. డీఈఓ నేతృత్వంలో పీఈటీ సంఘ నాయకులు, ఎంఎస్‌ఓలు, నియోజకవర్గ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ల సమన్వయంతో పోటీల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. తొలుత జిల్లాలో అత్యంత ఆదరణ కలిగిన 9 క్రీడాంశాల్లో మండలస్థాయి, నియోజకవర్గస్థాయి ఎంపికలు జరుగుతాయి. ఆ తదుపరి జిల్లాస్థాయి ఎంపిక పోటీలను జరుపుతాం. విజయవంతం చేయాలి.

– బీవీ రమణ,
స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి

పారదర్శకంగా ఎంపిక పోటీలు..



విద్యార్థి జీవితంలో కీలకమైన స్కూల్‌గేమ్స్ పోటీలను అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. వారు శిక్షణ పొందుతున్న క్రీడలో తమ ప్రతిభను నిరూపించుకోవాలి. ఎంపికలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అన్ని వసతులు, భోజనాలు కల్పించేలా ఎంఈవోలు, హెచ్ఎంలు, పీడీలు పూర్తి చొరవ తీసుకోవాలి.

– కె.వెంకటేశ్వరరావు,
డీఈఓ, శ్రీకాకుళం స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షులు

ఆలయ పూజారి ఆత్మహత్య

మందస: మందస పట్టణ శివారులోని కంచమయమ్మ ఆలయ పూజారి రమ్మోకాళియా(23) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మూడు రోజుల కిందటే జరగ్గా, ఆదివారం వెలుగు చూసింది. మందస పట్టణంలోని కొత్తవీధిలో నివాసముంటున్న కాళియా కుటుంబ సభ్యులు కంచమయమ్మ ఆలయ పూజారులుగా పని చేస్తున్నారు. చిన్నప్పుడే తల్లిదండ్రులు మరణించడంతో వారసత్వంగా అర్చకవృత్తి చేపట్టిన రమ్మో కాళియా కుటుంబ పరిస్థితుల దృష్ట్యా మద్యానికి బానిసయ్యాడు. మూడు రోజుల నుంచి ఇంటికి రాకపోవడంతో.. ఏదో ఒక సమయంలో వస్తాడులే అనుకుని బంధువులు అనుకున్నారు. కానీ ఆదివారం భక్తులు ఆలయానికి వెళ్లి చూడగా అక్కడకు సమీపంలోని మామిడిచెట్టుకు కాళియా ఉరికి వేలాడుతూ కనిపించాడు. దీంతో వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని, అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్న సమయంలో పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో 174 కింద కేసు నమోదు చేసి, కాశీబుగ్గ రూరల్ సీఐ శంకరరావు, మందస ఇన్‌చార్జి మధుసూదనరావు, ఏఎస్ఐ కె.శేఖర్‌రావు సంఘటనా స్థలానికి వెళ్లి దర్యాప్తు చేశారు. కాళియా ఇంటి పరిస్థితులు దృష్ట్యా మద్యానికి బానిసగా మారి, ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.


చెట్టుకు వేలాడుతున్న కాళియా మృతదేహం

కుటుంబంతో కలిసి వెళ్తుండగా..

టెక్కలి రూరల్:

సంతబొమ్మాళి మండలం నగిరిపెంట గ్రామ సమీపంలో రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడు ఒడిశా రాష్ట్రానికి చెందిన వాడు. ఈ మేరకు స్థానికులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌కు చెందిన స్వరూప్ మాలిక్(28) అనే వ్యక్తి తన భార్య, కుమారుడితో కలసి చేపల చెరువుల పని మీద విజయవాడ వెళ్లేందుకు ఆదివారం ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణమయ్యారు. డోర్ వద్ద కూర్చుని ఉండగా సంతబొమ్మాళి మండలం నగిరిపెంట గ్రామ సమీపంలోకి వచ్చేసరికి ప్రమాదవశాత్తు రైలు నుంచి కిందకు పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడున్న వారు వెంటనే ఆయనను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు రైల్వే పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు.

విద్యుత్ సరఫరా అంతరాయాల్ని నివారించేందుకు ప్రణాళికలు

- వినియోగంలో పరిశ్రమలు నియంత్రణ పాటించాలి
- పరిశ్రమలకు వారంలో ఒక రోజు పవర్ హాలిడే
- వైద్య సంబంధిత పరిశ్రమలు, రైస్ మిల్లులకు మినహాయింపు
- రెండు వారాల పాటు పవర్ హాలిడే అమలు
- ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

సాక్షి విశాఖపట్నం : గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ఏపీఈఆర్‌సీ ఆదేశాల మేరకు అవసరమైన ప్రణాళికలు అమలు చేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి స్పష్టం చేశారు. గృహ, పారిశ్రామిక రంగాలతో పాటు వ్యవసాయానికి 9 గంటల విద్యుత్‌ను సరఫరా చేసేందుకు విద్యుత్ పంపిణీ సంస్థలు, ప్రభుత్వం కృషి చేస్తున్నప్పటికీ ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఏర్పడిన విద్యుత్ కొరత కొంత ఇబ్బందికరంగా మారిందని పేర్కొన్నారు.

రాష్ట్రంలో రోజువారీ విద్యుత్ సరఫరా అవసరాలకు ప్రస్తుతం 230 మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరం ఉండగా థర్మల్, హైడల్, గ్యాస్, పవన, సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా 190 మిలియన్ యూనిట్ల విద్యుత్ మాత్రమే ఉత్పత్తి అవుతుండగా ఇంకా 40 మిలియన్ యూనిట్ల వరకూ కొరత వల్లే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో గృహ, వ్యవసాయ రంగాల అవసరాలకు తగిన ప్రాధాన్యమిచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.

అదేవిధంగా లోటు వర్షపాతం కారణంగా వ్యవసాయ సాగు కోసం ప్రాధాన్యమిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా, డిమాండ్ స్థితి, ఎక్స్ఛేంజీల నుంచి విద్యుత్ కొనుగోళ్ల పరిమాణం వాటి ప్రస్తుత ధరల్ని పరిశీలించిన కమిషన్ రాష్ట్రంలోని పరిశ్రమల విద్యుత్ వినియోగంపై కొన్ని నియంత్రణ చర్యలను చేపట్టేందుకు అనుమతించినట్లు వివరించారు.

ఇందులో భాగంగా సంస్థ పరిధిలో నిరంతర ప్రాసెసింగ్ పరిశ్రమలు తమ రోజువారీ విద్యుత్ వినియోగంలో 30 శాతం కాంట్రాక్టు లోడులో తగ్గించుకొనే విధంగా ఆయా పరిశ్రమలు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎండీ పృథ్వీతేజ్ సూచించారు. ఇతర పరిశ్రమలు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటలలోపు ఒక షిఫ్ట్ మాత్రమే పని చేయాలని, సాయంత్రం 6 తర్వాత విద్యుత్ వినియోగానికి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. వారానికి ఒకరోజు పవర్ హాలిడేను కూడా అమలు చేయాలని సూచించారు.

5 నుంచి 15 వరకు

పవర్ హాలిడేను జిల్లాల వారీగా రెగ్యులేట్ చేస్తామని, ఈ నెల 5 నుంచి 15 వరకూ రెండు వారాల పాటు పవర్ హాలిడే అమల్లో ఉంటుందని వివరించారు. ఈ నియంత్రణ చర్యల నుంచి బల్క్ డ్రగ్స్, ఫార్మాస్యూటికల్స్, వైద్య ఆక్సిజన్ ప్లాంట్లకు, రైస్ మిల్లింగ్ యూనిట్లకు సంబంధించిన పరిశ్రమలు మినహాయిస్తున్నట్లు తెలిపారు. నిబంధనలను అతిక్రమించే పరిశ్రమలకు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

ఫోన్ చేయండి

వీలైనంత త్వరగా మెరుగైన విద్యుత్ సరఫరా కోసం ప్రయత్నిస్తామని విద్యుత్ లభ్యత మెరుగైతే పవర్ హాలిడేను ఎత్తివేస్తామని, పారిశ్రామిక వినియోగదారులు సహకరించాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలపై వినియోగదారులు ఏపీఈపీడీసీఎల్ టోల్‌ఫ్రీ నంబర్ 1912 కు ఫోన్ చేసి తెలపవచ్చని సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సూచించారు.

వైఎస్సార్ సీపీలోకి 40 కుటుంబాలు


ధర్మాన సమక్షంలో పార్టీలోకి చేరిన నాయకులు

శ్రీకాకుళం రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, 2024లో కూడా పార్టీని అధికారంలోకి తీసుకురావాలని రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు కోరారు. గార మండలం సెగిడిపేట గ్రామానికి చెందిన 40 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బరాటం కామేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీలో చేరాయి. క్యాంప్ కార్యాలయంలో ఆదివారం వారికి మంత్రి ధర్మాన పార్టీ కండువాలు ఆహ్వానించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, రెల్లా నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో అన్ని స్థానాలు గెలుస్తాం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

సారవకోట: రానున్న ఎన్నికల్లో జిల్లాలోని అన్ని స్థానాల్లోనూ విజయ కేతనం ఎగురవేస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు జరిగినా పార్టీ విజయం సాధిస్తుందన్నారు. చంద్రబాబుకు పొత్తు లేకుండా ఎన్నికల్లో పోటీ చేసే ధైర్యం లేదని, తమ నాయకుడు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల్లో సింహంలా సింగిల్‌గా వస్తాడన్నారు. చంద్రబాబు నాయుడైనా, పవన్ కల్యాణ్ అయినా అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేయగలరా అని ప్రశ్నించారు. పార్టీలతో ప్రమేయం లేకుండా అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందిస్తున్న గొప్ప ప్రభుత్వం తమదన్నారు. రానున్న ఎన్నికలలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సారవకోటలో కార్యాలయం ప్రారంభించామని తెలిపారు. ప్రతి రెండు రోజులకోసారి కార్యాలయానికి వస్తానన్నారు. నరసన్నపేట నియోజకవర్గంలో చంద్రబాబు నాయుడు పోటీ చేసినా తాను గెలుస్తానన్నారు.

వైఎస్సార్ సీపీలో 292 కుటుంబాలు చేరిక

మండలంలోని పలు గ్రామాలకు చెందిన 292 కుటుంబాల వారు ఆదివారం నరసన్నపేట ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. సారవకోటలో నూతనంగా ప్రారంభించిన వైఎస్సార్ పార్టీ కార్యాలయంలో బుడితి, సారవకోట, కిడిమి, గ్రామాలతో పాటు పలు గిరిజన గ్రామాలకు చెందిన 292 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరారు.


పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న ధర్మాన కృష్ణదాస్

కార్యక్రమంలో జెడ్పీటీసీ వరుదు నాగేశ్వరి, మాజీ జెడ్పీటీసీ ధర్మాన పద్మప్రియ, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, సర్పంచ్‌లు బాడాన కృష్ణారావు, సాధు సతీష్, కొండాల బాబూరావు, శంకరబాబు, ఎంపీటీసీ మెండ బాలచంద్రరావు నాయుడు, జేఏసీ కన్వీనర్ నక్క తులసీదాస్, పార్టీ నాయకులు నిక్కు రాజశేఖర్, యాళ్ల శ్యామసుందరరావు, పల్లి కృష్ణారావు, మెండ సూర్యనారాయణ, జాడ కార్తీక్, గిరిజన ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి చౌదరి లక్ష్మీనారాయణ, జన్ని రామారావు తదితరులున్నారు.


జగనన్న కాలనీల నిర్మాణానికి ప్రాధాన్యత

ఎల్.ఎన్.పేట: పాతపట్నం నియోజకవర్గంలో అర్హత ఉన్నవారందరికీ జగనన్న కాలనీ ఇళ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఆమె ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో గృహనిర్మాణ శాఖ ఇంజినీరింగు అధికారులతో నియోజకవర్గ స్థాయి సమీక్ష చేశారు. ఇప్పటి వరకు పాతపట్నం నియోజవర్గంలోని ఐదు మండలాల్లోనూ 139 లేఅవుట్లు వేసి 3,169 మందికి జగనన్న కాలనీ ఇళ్లు మంజూరు చేశామన్నారు. ఆయా కాలనీల్లో 700 మంది లబ్ధిదారులు కాలనీ ఇళ్ల నిర్మాణం పనులు ప్రారంభించారని అన్నారు. కొరసవాడ, కాగువాడ, సీతారాంపల్లి, తామర, పాతపట్నంలో మూడు లేఅవుట్లు, దబ్బపాడు, తురకపేట, పారాపురం, మిరియాపల్లి, మెళియాపుట్టిలో కాలనీ ఇళ్ల నిర్మాణం పనులు చురుగ్గా జరుగుతున్నాయని తెలియజేశారు. జగనన్న కాలనీల్లో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు మొదటి విడతలో 87 పనులకు రూ.5.79 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. వీటిలో 25 రద్దు చేసి కొత్తగా మరో 75 పనులకు రూ.6.72 కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు. ప్రతిపాదనలు పంపించిన వాటిలో 41 పనులు రూ.1.86 కోట్లతో మంజూరైనట్లు తెలిపారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజనా పథకంలో నియోజకవర్గానికి 2,874 ఇళ్లు మంజూరైతే ఇప్పటి వరకు సుమారు 1400 ఇళ్లు నిర్మాణ దశల్లో ఉన్నాయని, నిర్మాణ స్థాయిలను బట్టి లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపు జరుగుతుందన్నారు. కొందరు సొంత స్థలాల్లో ఇల్లు కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని, వారికోసం నియోజకవర్గానికి 10వేల కాలనీ ఇళ్లు మంజూరు చేయాలని హౌసింగ్ ఎండీకి లేఖ రాశామని ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటికే సుమారు 3,500 కాలనీ ఇళ్లు కావాలని వచ్చిన దరఖాస్తులు గృహనిర్మాణ శాఖ అధికారుల వద్ద సిద్ధంగా ఉన్నాయని వివరించారు. సమీక్షలో డీఈ వి.నర్సింగరావు, పాతపట్నం, ఎల్.ఎన్.పేట, కొత్తూరు, హిరమండలం, మెళియాపుట్టి మండలాల ఏఈలు కె.రమేష్, గణేష్, మాధవరావు, ఆర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


కాలనీ ఇళ్లపై సమీక్ష చేస్తున్న పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వేస్టేషన్ పరిధి ఆమదాలవలస–దూసి రైల్వేస్టేషన్ల మధ్యలో గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారి పడి మృతి చెందినట్లు జీఆర్‌పీ ఎస్ఐ సీహెచ్‌ఎల్‌ఎన్ శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. మృతుడి వయసు దాదాపు 50 ఏళ్లు ఉంటుందని, ఛామన ఛాయలో రంగులో ఉంటాడని తెలిపారు. నీలం రంగు షర్టు, తెలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించామన్నారు. మృతుని వివరాలు తెలిస్తే శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్‌ను సంప్రదించాలని ఆయన తెలిపారు.


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు


కారు ఢీకొనడంతో నుజ్జునుజ్జయిన ఆటో


టిప్పర్ లారీ ఢీకొనడంతో గాయపడిన గౌరునాయుడు

లావేరు: మండలంలోని బుడుమూరు గ్రామం, అదపాక జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు వ్యక్తులకు గాయాలయ్యాయి. లావేరు స్టేషన్ హెచ్‌సీ రామారావు తెలిపిన ప్రకారం.. విజయనగరం జిల్లా వేపాడ మండలం తెట్టంగి గ్రామానికి చెందిన అల్లాడ సాంబశివరావు అతని భార్య సౌమ్య, అత్త, మామ సత్యవతి, సూర్యనారాయణ ఆదివారం ఆటోలో అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయానికి వెళ్లారు. దర్శనం అనంతరం తిరిగి ఆటోలో వెళ్లిపోతుండగా లావేరు మండలంలోని బుడుమూరు గ్రామం వద్ద ఒడిశా నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న కారు ఆటోను వెనుక వైపున బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న అల్లాడ సాంబశివరావు అతని భార్య సౌమ్య, అత్త, మామ సత్యవతిలు గాయాలయ్యాయి. గాయపడిన నలుగురు వ్యక్తులను 108లో ఆస్పత్రికి తీసుకువెళ్లారు.

టిప్పర్ ఢీకొని..

రణస్థలం మండలంలోని కొండములగాం గ్రామానికి చెందిన పిన్నింటి గౌరునాయుడు అనే వ్యక్తి ద్విచక్రవాహనంతో వెళుతుండగా లావేరు మండలంలోని అదపాక గ్రామం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ర్యాంగ్ రూట్‌లో వచ్చిన టిప్పర్ లారీ ఢీకొంది. దీంతో గౌరునాయుడికి గాయాలయ్యాయి. జాతీయ రహదారిపై వెళుతున్న వాహనదారులు స్పందించి గాయపడిన గౌరునాయుడుకు సహాయక చర్యలు అందించారు. గాయపడిన అతడిని చికిత్స కోసం 108 అంబులెన్సులో రిమ్స్‌కు తీసుకువెళ్లారు.